క్లుప్తంగా

ఇంటింటా కాంగ్రెస్ నాయకుల ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

కైలాస్‌నగర్: కాంగ్రెస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని విద్యానగర్ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న ఐదు గ్యారంటీలతో కూడిన స్టిక్కర్లను అతికించారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆదివాసీ బిడ్డ ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు నగేశ్ మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలోకి వస్తే పేద మహిళలకు సంవత్సరానికి లక్ష రూపాయలు, ఏడాదికి లక్ష ఉద్యోగాల భర్తీ, రైతులు పండించిన పంటలకు మద్దతు ధర వంటి పథకాలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆలీం, మహేందర్, సమీర్, గంగన్న, జబీన పాల్గొన్నారు.

'కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోసపోవద్దు'



పూజలు చేస్తున్న ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్

జైనథ్: కాంగ్రెస్, బీజేపీలను నమ్మి ప్రజలు మరోసారి మోసపోవద్దని, ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్ అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని కోర్ట గ్రామంలోని శివాలయంలో, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. రైతురుణమాఫీ, రైతుబంధు, మహిళలకు నెలకు రూ. 2500ల నగదు, రూ. 500లకే గ్యాస్ సిలీండర్ ఇలా ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి, బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సావాపూరే విజయ్ కుమార్, నాయకులు సర్పన్ లింగారెడ్డి, కోల భోజన్న, గోస్కుల మహేశ్, మద్దుల ఊశన్న పాల్గొన్నారు.

రామనవమి ఉత్సవాలకు నిధుల సేకరణ

తాంసి: రామనవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆయా గ్రామాల్లో ఇప్పటికే ఏర్పాట్లు చేస్తున్నారు. భీంపూర్ మండలంలోని అంతర్గాం గ్రామంలో ఉత్సవాల నిర్వహణ కోసం గ్రామానికి చెందిన మహిళలు ఆదివారం నిధులు సేకరించారు. గ్రామస్తులు స్వచ్ఛందంగా విరాళాలు అందజేశారు. గ్రామస్తులు అందించిన విరాళాలను స్థానిక రామాలయంలో లెక్కించారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాకేశ్, సుధాకర్, మహిళలు పాల్గొన్నారు.

సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ రాష్ట్ర టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీవర్ధన్‌రెడ్డిని పేటా సంఘం నాయకులు సన్మానించారు. ఆదివారం జిల్లా కేంద్రంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదిలాబాద్‌కు చెందిన శ్రీవర్ధన్ రెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నిక కావడం సంతోషంగా ఉందన్నారు. టేబుల్ టెన్నిస్ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. పేటా సంఘం కోశాధికారి జంజర్ల సాయికుమార్, జిల్లా జిమ్నాస్టిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రదీప్, రాష్ట్రపాల్‌లు ఆయనను శాలువాతో సత్కరించారు.

జైనథ్: తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు నిర్వహించిన కథల పోటీల్లో మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన విద్యార్థిని తల్లెల కీర్తి రచించిన 'రాము.. సోము' ఉత్తమ కథగా ఎంపిక కావడంతో, ఆమెను మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తల్లెల చంద్రయ్య ఆదివారం ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో ఇలాంటి మరిన్ని కథలతో, మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని ఆకాంక్షించారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన కొంకటి రాకేశ్ (27) ఇటీవల ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రిమ్స్‌లో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఈనెల 10న కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 12న మృతి చెందినట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.



సిరికొండ: నివాళులర్పిస్తున్న నాయకులు



ఆదిలాబాద్‌టౌన్: నివాళులర్పిస్తున్న జోగు రామన్న, ఆత్రం సక్కు



ఇంద్రవెల్లి: ప్రార్థనలు చేస్తున్న బుద్ధభక్తులు

ఘనంగా అంబేద్కర్ జయంతి

రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ 133వ జయంతిని ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయా సంఘాల నాయకులు, అధికారులు అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ న్యాయవాదిగా, ఆర్థిక వేత్తగా, రాజకీయ వేత్తగా, అన్నింటికి మించి సామాజిక సంస్కర్తగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్, మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న నివాళులర్పించారు. ప్రతిఒక్కరూ అంబేద్కర్ బాటలో నడవాలన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



ఆదిలాబాద్‌టౌన్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్, గోడం నగేశ్



ఎదులాపురం: నినాదాలు చేస్తున్న నాయకులు



జైనథ్: లక్ష్మీపూర్‌లో..



ఇచ్చోడ: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్



ఉట్నూర్‌రూరల్: నివాళులర్పిస్తున్న అధికారులు



ఆదిలాబాద్‌రూరల్: నివాళులర్పిస్తున్న డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి, కాంగ్రెస్ నాయకులు



నార్నూర్: నివాళులర్పిస్తున్న గజానంద్ నాయక్, నాయకులు



తలమడుగు: నివాళులర్పిస్తున్న మాలసంక్షేమ సంఘం నాయకులు



కైలాస్‌నగర్: నివాళులర్పిస్తున్న డీఎం, ఆర్టీసీ ఉద్యోగులు



తాంసి: నివాళులర్పిస్తున్న యువకులు



బేల: బీఆర్ఎస్ నాయకుల నివాళులు



నేరడిగొండ: వడూర్‌లో..



బజార్‌హత్నూర్‌లో..

నేటి నుంచి జొన్న కొనుగోళ్లు ప్రారంభం

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం నుంచి జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నట్లు పీఏసీఎస్ సీఈవో ధరంసింగ్ అదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఏసీఎస్, మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న కొనుగోలు కేంద్రంలో క్వింటల్‌కు రూ. 3180తో జొన్న కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులు పండించిన జొన్న పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే అమ్మి మద్దతు ధర పొందాలన్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం ఉదయం 11 గంటలకు జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నట్లు వ్యవసాయ సహకార సంఘం సీఈవో రాథోడ్ ఈశ్వర్ తెలిపారు. జొన్న పంటను కొనుగోళ్ల కేంద్రానికి తీసుకురావాలని కోరారు.

నేడు బీజేపీ కార్యాలయం ప్రారంభం

ఇచ్చోడ: మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం 3 గంటలకు బీజేపీ కార్యాలయం ప్రారంభించనున్నట్లు మండల అధ్యక్షుడు కేంద్రే నారాయణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానందం, ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గోడం నగేశ్ హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యకర్తలు, నాయకులు హాజరు కావాలని కోరారు.

బాధిత కుటుంబానికి సాయం



సాయం అందిస్తున్న నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన ఉప్పు నవీన్ ఉపాధి కోసం బెహరాన్ దేశం వెళ్లగా.. అక్కడ ఈ నెల8న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబీకులకు మృతదేహం తీసుకొచ్చే స్థోమత లేకపోవడంతో ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. ఆదివారం మృతుడి భార్య లావణ్యకు పట్టణంలోని ఐదోవార్డు కౌన్సిలర్ పరిమి లతసురేశ్ తమ వంతుగా రూ.5వేలను ఆర్థికసాయంగా అందించారు. కార్యక్రమంలో షబ్బీర్‌పాషా, సలీంఖాన్ ఉన్నారు.

కుట్టుశిక్షణ ప్రారంభం

ఖానాపూర్: నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో భాగంగా మండలంలోని ఎర్వచింతల్ గ్రామంలో ఆదివారం కుట్టుశిక్షణను ప్రారంభించారు. ఈసందర్భంగా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మేనేజర్ ఆర్తి చవాన్ కోరారు. ఇందులో బ్లాక్ మేనేజర్ మలావత్ గణేశ్ ఉన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



గోకొండలో పంట చేనులో చేతికి అందే ఎత్తులో విద్యుత్ తీగలు

- చేతికి అందే ఎత్తులో తీగలు
- నెలలు గడుస్తున్నా.. పట్టించుకోని అధికారులు
- నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం

బజార్‌హత్నూర్: మండలంలోని చేల వద్ద ఇళ్ల మధ్య విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మండలంలో రెండు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో 64 గ్రామాలున్నాయి. పంట చేన్లలో విద్యుత్ తీగలు చేయికి అందే ఎత్తులో ఉన్నాయి. అనుకోకుండా చేయి తగిలిన, ట్రాక్టర్‌పై, ఎడ్లబండిపై వెళ్లేటప్పుడు తగిలితే ప్రాణాలకే ప్రమాదం.

పొంచి ఉన్న ప్రమాదం..

వంగిన విద్యుత్ స్తంభాలు, నేలకు సమీపంలో విద్యుత్ తీగలు ఉండడంతో ప్రమాదాలు చోటు చేసుకునే పరిస్థితి ఉంది. మేలో సుడిగాలులతో కూడిన వర్షం కురిస్తే ఒకదానికి ఒకటి తాకి షార్ట్‌సర్క్యూట్ అయ్యే అవకాశం ఉంది. గతంలో గిర్నూర్ గ్రామం పరిసరాల్లోని పంట పొలాల్లో నాలుగు గేదెలు, భూతాయిలో రెండు ఆవులు, గులాబ్‌తండాలో ఒక ఆవు, దేగామలో ఒక ఎద్దు, టెంబిలో ఆవు విద్యుత్ తీగల తాకి మృత్యువాత పడ్డాయి. గతంలో జరిగిని ప్రమాదాలను అధికారులు దృష్టిలో ఉంచుకోని విద్యుత్ తీగలు, స్తంభాలను సరిచేయాలి. మండలంలో రెండు విద్యుత్ సబ్‌స్టేషన్లకు ఏఈ స్థాయి అధికారిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ లైన్ సరిచేస్తాం

మండలంలో అన్ని గ్రామాల పరిధిలోని విద్యుత్ లైన్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి వారంలో విద్యుత్ లైన్లను, తీగలను సరిచేస్తాం. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలు ఏర్పాటు చేయిస్తాం.

– శ్రీనివాస్, ఏఈ విద్యుత్‌శాఖ, బజార్‌హత్నూర్

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు



గ్రామ సమీపంలో మొర్కండి రోడ్డు నుంచి గోకొండ గ్రామం వరకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. సంవత్సరం గడిచినా.. ఇప్పటి వరకు వాటిని పట్టించుకున్న అధికారి లేడు. దీంతో విద్యుత్ సరఫరాలేక మోటర్లు నడడం లేదు.

– ప్రవీణ్‌కుమార్ గోకొండ

ప్రాణాలకే ప్రమాదం



మా పంట చేనులో విద్యుత్ తీగలు చేతికి అందే ఎత్తులో ఉన్నాయి. అనుకోకుండా చేయి తగిలితే ప్రాణాలకే ప్రమాదం. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా.. పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా తీగలు సరి చేయాలి.

– దీసీ విలాస్, రైతు, బజార్‌హత్నూర్

'బీజేపీది ఒంటెద్దు పోకడలు'

నేరడిగొండ: బీజేపీది ఒంటెద్దు పోకడలని పార్టీ మండల మాజీ అధ్యక్షుడు సోసయ్య హీరాసింగ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత పదిహేను సంవత్సరాల నుంచి బీజేపీలో పనిచేస్తున్నామని, అలాంటిది ఏకపక్ష నిర్ణయంతో నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారని మండిపడ్డారు. అలాగే క్రమశిక్షణ లేకుండా నిర్ణయాలు తీసుకుంటుందని, ఇది సరికాదన్నారు. జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానందం ఒంటెద్దు పోకడ నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా బీజేపీ కార్యకర్తల ఆత్మగౌరవాన్ని కాపాడాలని కోరారు. సమావేశంలో నాయకులు తొడసం శంకర్, సోలంకి ప్రశాంత్, గంధం నవీన్, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ దీక్షలకు కేరాఫ్ 'సింగాపూర్'

- 34 ఏళ్లుగా ఆలయంలో దీక్షల స్వీకరణ
- ఏటా పెరుగుతున్న దీక్షపరులు



హనుమాన్ దీక్ష స్వీకరించిన యువకులు

బేల: మండలంలోని సిర్సన్న సింగాపూర్ హనుమాన్ ఆలయం హనుమాన్ దీక్షలకు కేరాఫ్‌గా మారింది. 34 ఏళ్ల నుంచి ఈఆలయంలో హనుమన్ దీక్షల స్వీకరణ కొనసాగుతోంది. ఏటా దీక్షపరులు సైతం పెరుగుతున్నారు. యువత, చిన్నారులు దీక్షల బాట పడుతున్నారు. హనుమాన్ మాలధారణతో చిన్నారుల నుంచి యువత, పెద్దల వరకు ఆధ్యాత్మిక భావన పెరుగుతోంది. ఇదిలా ఉండగా.. మండలంలోని సిర్సన్న, బాది గ్రామాల మధ్యన సింగాపూర్ గ్రామ శివారులో పాత హనుమాన్ విగ్రహం లభించడంతో సిర్సన్న గ్రామానికి చెందిన వీర హనుమాన్ భక్తుడు, అర్చకులు పన్నలాల్ చౌదరి నూతన హనుమాన్ ఆలయం నిర్మాణానికి శ్రీకారం చుట్టాడు. ఈ క్రమంలో సిర్సన్న గ్రామస్తులు, ఇతర ప్రాంతాల భక్తుల 1989లో హనుమాన్ ఆలయం నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు దీక్షల స్వీకరణ కొనసాగుతోంది. ఈనెల 23న హనుమాన్ జయంతి సందర్భంగా 41రోజల ముందు నుంచి హనుమాన్ దీక్షల స్వీకరణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.

ఇతర ప్రాంతాల నుంచి వచ్చి..

మండల కేంద్రంతో పాటు చప్రాల, సాంగిడి, సిర్సన్న, అవాల్‌పూర్, మశాల(బి), ఎకోరి, తదితర గ్రామాల నుంచి 30 నుంచి 40 మంది వరకు హనుమాన్ దీక్షలు స్వీకరిస్తున్నారు. దీంతో పాటు జైనథ్, నార్నూర్, గాదిగూడ, ఇచ్చోడ, బజార్‌హత్నూర్ మండలాల నుంచే కాకుండా మహారాష్ట్రలోని పాటన్‌బోరి, ఝరి జామిని, తదితర ప్రాంతాల వారు సైతం ఇక్కడి వచ్చి దీక్షలను స్వీకరిస్తారు.

ఈసారి దీక్షల స్వీకరణ ఇలా..

గత నెల 14న 41రోజుల మండల హనుమన్ మాల ధారణ దీక్షల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 3న 21 రోజుల అర్ధమండల హనుమన్ మాలధారణ, ఈనెల 13న 11 రోజుల దీక్షల స్వీకరణ కార్యక్రమాలు కొనసాగాయి. ప్రతీ ఏటా యువకులు చాలా మంది దీక్షలను స్వీకరిస్తున్నారు. నియమ, నిష్ఠలతో ఉపవాస దీక్షలను ఆచరించడంతో పాటు భజన, కీర్తనలతో హనుమాన్‌ను నిత్యం ఆరాధిస్తున్నారు.

వైభవంగా గుడిపడ్వ పంచమి వేడుకలు



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

బేల: మండలంలోని కాప్సి(బి) గ్రామంలో ఆధ్యాత్మిక గురువు నానాజీ మహరాజ్ గుడిపడ్వ పంచమి వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన వీధుల గుండా భజన, కీర్తనల మధ్య 101కొబ్బరి కాయలతో పల్లకిని ఊరేగించారు. చిన్నారులను దేవత మూర్తుల వేషదారణలో అలంకరించారు. నానాజీ మహరాజ్ దంపతుల విగ్రహాలకు, పల్లకికి, కొబ్బారికాయల ప్రతిష్ఠాపనకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాలదహీ హండీ నిర్వహించారు.



దేవతమూర్తుల వేషధారణలో చిన్నారులు

పథకాలు ప్రతీ కుటుంబానికి అందిస్తాం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆరు గ్యారంటీలను ప్రతీ కుటుంబానికి అందిస్తామని ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఆదివాసీ ఎస్టీ సెల్ జిల్లా చైర్మన్ సెడ్మకి ఆనంద్ రావ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మండలంలోని గుండంలొద్దీ, గంగారాంగూడ, ధర్‌లొద్దీ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పథకాల కరపత్రాలను ఆవిష్కరించి, ఇంటింటికీ పంపిణీ చేశారు. పదేళ్ల బీజేపీ పాలనలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు.